సాక్షి ఖమ్మం
మంగళవారం : 30 : మే : 2023



కేసీఆర్ ప్రభుత్వమే శ్రీరామ రక్ష
కేసీఆర్ ప్రభుత్వమే ప్రజలకు శ్రీరామరక్ష అని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. ఇల్లెందులో సోమవారం ఆయన మాట్లాడారు. 8లో



బడ్డీ యాప్‌తో సమస్యకు చెక్
ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఏ సమస్య ఉన్నా బడ్డీ యాప్‌తో పరిష్కరించుకునే వెసులుబాటును మున్సిపల్ శాఖ కల్పించింది. 8లో

గరిష్టం / కనిష్టం
41° / 27°

వాతావరణం
జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గంటగంటకూ ఎండ పెరుగుతూ ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు నగరంలోని జహీర్‌పుర రజబ్ అలీ పార్క్‌లో మమత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తారు. 10 గంటలకు ఐడీఓసీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలపై అధికారులతో సమీక్షించనున్నారు. సాయంత్రం 5 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియంలో జాతీయ మహిళా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం 17, 27, 28వ డివిజన్లలో సీసీ రోడ్లను ప్రారంభిస్తారు.

పాఠశాలలకు పుస్తకాల తరలింపు


పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న డీఈఓ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుతున్నాయి. వాటిని ప్రభుత్వ పాఠశాలలకు తరలించే ప్రక్రియ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ సోమశేఖర శర్మ మాట్లాడుతూ.. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా పుస్తకాలు అన్ని స్కూళ్లకు చేరేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఉద్యోగులు కేవీ రామారావు, రఫీ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సంక్షేమాధికారిగా జ్యోతి


బాధ్యతలు స్వీకరిస్తున్న జ్యోతి

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా సంక్షేమాధికారిగా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. డీడబ్ల్యూఓ సీహెచ్ సంధ్యారాణికి ఈ నెల 4న రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి కరీంనగర్ జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 15న సంధ్యారాణి రిలీవ్ అవుతూ తన బాధ్యతలను కల్లూరు ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణకుమారికి అప్పగించారు. అయితే కృష్ణకుమారి కొంత కాలంగా సెలవులో ఉన్నారు. దీంతో జిల్లా సంక్షేమాధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో జ్యోతికి జిల్లా సంక్షేమాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

గుంటుమల్లన్న ఆలయంలో జిల్లా జడ్జి పూజలు


ఆలయంలో జడ్జి దంపతులు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా జడ్జి బీఎస్ జగ్జీవన్ కుమార్ దంపతులు సోమవారం ఖమ్మం నగరంలోని శ్రీ గుంటుమల్లేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు దాములూరి కృష్ణశర్మ జడ్జి దంపతులచే స్వామివారికి అభిషేకం, పూజలు చేయించారు. అనంతరం వారికి వేదాశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చందూరు రామకోటేశ్వరరావు, ప్రధాన అర్చకులు దాములూరి వీరభద్రరావు పాల్గొన్నారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: రామాలయంలో శ్రీసీతారామ చంద్రస్వామివారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

కిట్.. రైట్ రైట్!

- గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి కసరత్తు
- రక్త హీనత నివారణే లక్ష్యంగా కార్యాచరణ
- త్వరలోనే పంపిణీ ప్రారంభం
- ఇప్పటికే జిల్లాకు చేరిన 1,441 కిట్లు


న్యూట్రిషన్ కిట్ బాక్స్‌లు, కిట్‌లోని వస్తువులు

ఖమ్మం వైద్యవిభాగం: మాతా శిశు సంరక్షణకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పేరిట మరో పథకాన్ని ప్రవేశపెట్టింది. గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచేందుకు ఈ కిట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటివరకు ఎంపిక చేసిన జిల్లాల్లోనే ఈ కిట్లు పంపిణీ చేయగా... త్వరలో అన్ని జిల్లాల్లో ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాకు కూడా ప్రభుత్వం తొలి విడతగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు సరఫరా చేసింది. వీటిని పెద్దాస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో భద్రపరిచారు. కాగా, గర్భిణులు ప్రసవించే వరకు న్యూట్రిషన్ కిట్లను రెండు దఫాలుగా అందించనున్నారు. ప్రతీ కిట్‌లో ఐరన్ సిరప్, కర్జూరా, న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, నెయ్యి, నట్టల నివారణ మాత్రలు తదితరాలు ఉండనున్నాయి.

బిడ్డ ఎదుగుదలపై ప్రభావం పడకుండా..

రక్తహీనతతో బాధ పడేవారు ఎక్కువగా ఉన్న జిల్లాల జాబితాలో ఖమ్మం కూడా ఉంది. ముఖ్యంగా పౌష్టికాహార లోపం వల్ల రక్త హీనత సంభవిస్తుంది. రక్తం తక్కువగా ఉండటం మూలంగా గర్భిణుల్లో అనారోగ్య సమస్యలు రావటంతో పాటు బిడ్డ ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుంది. దీని మూలంగా పిల్లలు వివిధ అనారోగ్య సమస్యలతో పాటు బరువు తక్కువగా పుడతారు. ఈ పరిస్థితిని అధిగవించేందుకు ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయనుంది. ప్రతీ గర్భిణికి రెండు దఫాలుగా ఈ కిట్లు అందజేస్తారు. తొలి దఫాలో జిల్లాకు 1,511 కిట్లు కేటాయించగా ఇప్పటివరకు 1,441 కిట్లు వచ్చాయి. ఇందులో ఖమ్మం పెద్దాస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి 626, తిరుమలాయపాలెం సీహెచ్‌సీకి 55, మధిర సీహెచ్‌సీకి 185, సత్తుపల్లి 419, వైరా 77, కామేపల్లికి 79 కిట్లు కేటాయించారు.

జిల్లాలో 7,563 మంది గర్భిణులు..

గర్భిణుల్లో రక్త హీనతను నివారించేందుకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయనున్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. కాగా గర్భిణులకు 3వ నెల, 8వ నెలల్లో ఈ కిట్లు పంపిణీ చేస్తారు. జిల్లాలో 14 - 26 నెలల మధ్య 4,902 మంది గర్భిణులు ఉండగా, 27 - 34 నెలల మధ్య 2,661 మంది ఉన్నారు. వీరంతా వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేర్లు నమోదు చేసుకున్న వారు మాత్రమే. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చూపించుకున్న వారికి మాత్రమే న్యూట్రిషన్ కిట్లు అందజేస్తారు. ఒక్కో కిట్‌లో 500 గ్రాముల మదర్స్ హార్లిక్స్ రెండు, 200 మి.లీ. ఐరన్ సిరప్‌లు మూడు, కేజీ కర్జూర, ప్లాస్టిక్ బాస్కెట్, ప్లాస్టిక్ కప్, విజయ నెయ్యి 450 ఎం.ఎల్., ఆల్బెండజోల్ మాత్రలు ఉంటాయి.

త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు



కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు ఇప్పటికే జిల్లాకు చేరాయి. త్వరలో మరిన్ని సరఫరా కానున్నాయి. పథకం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడమే తరువాయి. న్యూట్రిషన్ కిట్ వల్ల గర్భిణులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వీటిని వినియోగించడం వల్ల గర్భిణుల్లో రక్తహీనత తగ్గిపోయి సాధారణ స్థితికి వస్తారు. తర్వాత బిడ్డ ఎదుగుదల సక్రమంగా జరిగి ప్రసవం సులభమవుతుంది. శిశువులు కూడా ఆరోగ్యంగా పుడతారు.

– డాక్టర్ సైదులు, మాతా శిశు ఆరోగ్య కేంద్రం కో ఆర్డినేటర్

సమన్వయంతో పనిచేయండి

- దశాబ్ది వేడుకల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమ్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్, పక్కన సీపీ వారియర్

ఖమ్మం సహకారనగర్ : జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఉత్సవాల నిర్వహణపై సీపీ విష్ణు ఎస్ వారియర్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ, పోలీస్ అధికారులతోనూ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో 29వ రాష్ట్రంగా ఏర్పాటైన తెలంగాణ పదో అవతరణ దినోత్సవాలను నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. మిషన్ భగీరథ, దళిత బంధు, రైతుబంధు, టీఎస్ ఐపాస్, ఆసరా పెన్షన్లు తదితర పథకాలతో ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉన్నామన్నారు. పెన్షన్ల పంపిణీ, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, గొర్రెల పంపిణీ, ఇళ్ల ప్లాట్ల పంపిణీ తదితర సంక్షేమ పథకాలకు సంబంధించి ఆయా శాఖల వారీగా వివరాలు సిద్ధం చేయాలన్నారు. సీపీ విష్ణు ఎస్. వారియర్ మాట్లాడుతూ.. 21 రోజులు పోలీసులు అన్ని శాఖలతో టీమ్‌గా ఏర్పడి పనిచేయాలన్నారు. సమూహం ఎక్కువగా ఉన్న వేడుకల్లో పోలీసులు క్రియాశీలక పాత్ర పోషించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జూన్ 4న భద్రత దినం, 8న ఊరూరా చెరువుల పండుగ, 12న తెలంగాణ రన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

129 రైతు వేదికల్లో వేడుకలు..

రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా జిల్లాలోని 129 రైతు వేదికల్లో దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి నిర్వహించిన వీసీలో కలెక్టర్ మాట్లాడారు. రోజువారీ షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు విజయవంతంగా చేపడతామన్నారు. జిల్లాలో అన్ని శాఖల ద్వారా సాధించిన ప్రగతి వివరించేలా పకడ్బందీగా వేడుకలు జరుపుతామని చెప్పారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్.మధుసూదన్, కెఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు రాధిక గుప్తా, మయాంక్ సింగ్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు డీసీపీ బోస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి..

ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. సోమవారం ఆయన అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కేటాయించిన రైస్ మిల్లులకు రవాణా చేయాలన్నారు. జిల్లాలో 236 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 198 కేంద్రాల ద్వారా 14,954 మంది రైతుల నుంచి 1,22,619.240 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. 44 మొక్కజొన్న సేకరణ కేంద్రాలను ప్రతిపాదించగా, ఇప్పటికి 37 కేంద్రాలు ప్రారంభించి 5,331 మంది రైతుల నుంచి 31,913.953 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. కేంద్రాల వద్ద రైతులు, హమాలీలకు నీడ కోసం షామియానా, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్డీఓ విద్యాచందన, డీసీఓ విజయకుమారి, డీసీఎస్ఓ రాజేందర్, ఆర్డీఓ కిషన్ రావు, డీఎం సీఎస్ సోములు, మార్క్‌ఫెడ్ డీఎం సునీత, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న క్రికెట్ పిచ్

నేటి నుంచి ఆలిండియా మహిళా క్రికెట్ టోర్నీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్ : ఆలిండియా మహిళా టీ-20 క్రికెట్ టోర్నీ నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మంగళవారం ప్రారంభం కానుంది. ఇందుకోసం స్టేడియంలోని క్రికెట్ పిచ్‌ను ముస్తాబు చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న మహిళా క్రికెటర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే తమిళనాడు, మహరాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల జట్లు ఖమ్మం చేరుకున్నాయి. నేటి నుంచి జూన్ 6 వరకు లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగనున్నాయి. పోటీలను చూసేందుకు అధిక సంఖ్యలో క్రికెట్ అభిమానులు వచ్చే ఆవకాశం ఉండడంతో అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పోటీలను ప్రారంభించనున్నారు. 12 రాష్ట్రాల నుంచి 180 మంది మహిళా క్రికెటర్లు వస్తున్నారని, ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని టోర్నీ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఎనిమిది రోజుల పాటు జరిగే ఈ టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు ఆలిండియా మహిళా టీ -20 కమిటీతో పలుమార్లు సమీక్షలు జరిపామని చెప్పారు. పోటీల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు సకాలంలో, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ బృందం సభ్యులు సూచించారు. సోమవారం వారు పర్ణశాల పీహెచ్‌సీ పరిధిలోని చిన్ననల్లబల్లి సబ్ సెంటర్‌ను సందర్శించారు. బృందం సభ్యులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ అనంత పద్మానాభ భట్, డాక్టర్ షాహిద్ అలీ తదితరులు ఆస్పత్రిలో వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. సబ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీ పనితీరుపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే బాధితులకు ఆరోగ్య పరీక్షలు, అవగాహన పెంపొందించడం వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పర్ణశాల పీహెచ్‌సీని సందర్శించి, పలు సూచనలు చేశారు. తొలుత పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం



ఖమ్మం సహకారనగర్: ఓటరు నమోదుకు మరోసారి అవకాశం కల్పిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ప్రతీ ఏడాది నవంబర్‌లో ముసాయిదా జాబితా ప్రకటించి జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారు. అయితే ఈ ఏడాది ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్)ను రెండోసారి షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించింది. నూతన షెడ్యూల్ ఈనెల 25న ప్రారంభం కాగా.. ఆగస్టు 2న ముసాయిదా జాబితా ప్రకటిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలను ఆగస్టు 2 నుంచి 31 వరకు స్వీకరించనున్నారు. ఈ మధ్యలో ఓటు నమోదు తొలగింపులు, మార్పులు తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇదే క్రమంలో రెండు శనివారాలు, రెండు ఆదివారాల్లో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించనున్నారు. జూన్ 23 వరకు బీఎల్ఓలు ఇంటింటి పరిశీలన చేసి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించడంతో పాటు రెండు ఓట్లు ఉన్న వారిని గుర్తించడం, చనిపోయిన వారి ఓట్లు తొలగించడం వంటివి చేయనున్నారు. ఈ ఏడాది జనవరి 5న ప్రచురించిన తుది జాబితా ప్రకారం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కలిపి 11,53,987 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 5,62,623, మహిళలు 5,91,290, ఇతరులు 74 మంది ఉన్నారు.

ఇక ఏడాదికి రెండుసార్లు జాబ్‌మేళా


ఉద్యోగానికి ఎంపికైన యువతికి అపాయింట్‌మెంట్ లెటర్ అందిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి


అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీల ప్రతినిధులు

- నిరుద్యోగుల మోముల్లో చిరునవ్వే లక్ష్యం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా యువతకు హామీ ఇస్తున్నా
- మెగా జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో మాజీ ఎంపీ పొంగులేటి
- 10 వేల ఉద్యోగాలకు 21వేల మంది పేర్లు నమోదు

ఖమ్మంమయూరిసెంటర్ : నిరుద్యోగ యువత కోసం ఇకపై తన ఆధ్వర్యంలో సంవత్సరానికి రెండు సార్లు జాబ్‌మేళా నిర్వహిస్తానని, ఇది ఉమ్మడి జిల్లా యువతకు తాను ఇస్తున్న హామీ అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో పొంగులేటి ఆధ్వర్యంలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత మోముల్లో చిరునవ్వు చూడాలన్నదే తన లక్ష్యమని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతీ నిరుద్యోగికి ఉద్యోగం ఇప్పించే బాధ్యత తనదేనని అన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో తీవ్రమైన సమస్యలు పేరుకుపోయాయని, అన్ని వర్గాల వారిని సీఎం కేసీఆర్ తన మాటలతో మాయ చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేస్తున్నారని అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగుల ఆశలు, ఆశయాలను నెరవేర్చేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు. జాబ్‌మేళాలో దివ్యాంగులకు, ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. చిన్న ఉద్యోగం, తక్కువ వేతనం అని చూడకుండా ఉద్యోగాల్లో చేరి ఉన్నత స్థానాలకు ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు. తన బృందం మీ వద్దకు వచ్చినప్పుడు వారిని ఆశీర్వదించాలని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో తన మనుషులను దీవించాలని ఈ సందర్భంగా కోరారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన..

పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా నుంచి నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. మొత్తంగా 21వేల మంది పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 100 కంపెనీలతో ఇంటర్వ్యూలు నిర్వహించాలని నిర్ణయించగా.. మొత్తం 120 కంపెనీలు 10 వేల పోస్టుల ఖాళీలతో పాల్గొన్నాయని నిర్వాహకులు వెల్లడించారు. 18 వేల మంది ఇంటర్వ్యూల్లో పాల్గొనగా, 10 వేల ఖాళీలకు అభ్యర్థులను కంపెనీలు ఎంపిక చేశాయని, స్పాట్‌లో 4,218 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందించారని చెప్పారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో అందించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నాలుగు హెల్ప్ డెస్క్‌లతో పాటు రెండు పెద్ద హాళ్లలో ఇంటర్వ్యూలకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పించారు. చంటి పిల్లలతో తల్లులు జాబ్ మేళాకు హాజరు కాగా, వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఊకంటి గోపాలరావు, జారె ఆదినారాయణ, డాక్టర్ కోటా రాంబాబు, విజయబాయి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, కార్పొరేటర్లు దొడ్డా నగేష్, మలీదు జగన్, మియాభాయ్, నారపోగు వెంకట్, రైట్ ఛాయిస్ మెండెం కిరణ్ కుమార్, కొత్త కోటేశ్వరరావు, జాబ్ మేళా కన్సల్టెన్సీల నిర్వాహకుడు మన్ మోహన్ పాల్గొన్నారు.

మంచి స్పందన వచ్చింది..



మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి వేలాది సంఖ్యలో నిరుద్యోగ యువత పేర్లు నమోదు చేసుకున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం. పది వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం.

– తుంబూరు దయాకర్‌రెడ్డి, పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి

నాకు మొదటి ఇంటర్వ్యూ..



ఇంజనీరింగ్ పూర్తి చేశా. ఇదే నాకు మొదటి ఇంటర్వ్యూ. ఇంత పెద్ద జాబ్ మేళాలో పాల్గొనడం సంతోషంగా ఉంది. మూడు కంపెనీల ఇంటర్వ్యూల్లో పాల్గొన్నా. వారు ఇచ్చే ఆఫర్‌లో నచ్చిన కంపెనీలో చేరాలనుకుంటున్నా.

– స్రిమాన్, ఖమ్మం

సంతోషంగా ఉంది..



ఖమ్మం కేంద్రంగా మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. స్థానికంగా జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అవకాశం కల్పించిన నిర్వాహకులకు ధన్యవాదాలు. రెండు కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరయ్యా. నచ్చిన కంపెనీలో చేరుతా.

– రుత్విక, ఖమ్మం

క్లుప్తంగా

నాణ్యత లోపిస్తే సహించేది లేదు

● స్టేట్ క్వాలిటీ మానిటర్ ఇమామ్



రహదారి పనులను పరిశీలిస్తున్న ఇమామ్

నేలకొండపల్లి : రహదారి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని స్టేట్ క్వాలిటీ మానిటర్ (ఎస్‌టీఎం) షేక్ ఇమామ్ హెచ్చరించారు. మండలంలోని కోనాయిగూడెం – నాచేపల్లి రహదారి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వై పథకం ద్వారా రూ.13.50 కోట్లతో 17 కిలో మీటర్ల మేర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కోనాయిగూడెం, ఆరెగూడెం, గువ్వలగూడెం గ్రామాల్లో పనుల్లో పురోగతి బాగుందని ప్రశంసించారు. రహదారి పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడితే చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ శివగణేష్, జేఈ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల రథసారథి టీపీటీఎఫ్



మాట్లాడుతున్న నాగిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన సంఘం తమదేనన్నారు. సమాజ శ్రేయస్సు, విద్యారంగ ప్రగ తి, ఉపాధ్యాయుల సంక్షేమమే అజెండాగా టీపీటీఎఫ్ పని చేస్తోందని చెప్పారు. ఉద్యోగులకు జీవిత భద్రత లేని సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. వేడుకల్లో భాగంగా డీఈఓ కార్యాలయం వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పి.వి.ఆర్.కె. ప్రసాదరావు, బి.ముత్తయ్య, ఎ.వి.నాగేశ్వరరావు, వి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతకు రశీదు అందచేస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి సోమవారం ఖమ్మం నగరంలోని ఖానాపురం ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయురాలు ఉమా సుందరి రూ.1,01,116 విరాళం అందించారు. ఆలయ అధికారులు దాతకు రశీదును అందచేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా, అర్చకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్గంపాడు: తెలంగాణ గురుకుల సొసైటీ పరిధిలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యాబోధన కోసం గెస్ట్ ఫ్యాకల్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బూర్గంపాడు, వైరా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు రాజ్యలక్ష్మి, రమా తెలిపారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అన్ని సబ్జెక్టులలో విద్యాబోధనకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 3వ తేదీ సాయంత్రం వరకు అభ్యర్థులు తమకు సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలల్లో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. బోధన అనుభవం, అకడమిక్ రికార్డు ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు.

బాలుడిపై పిచ్చికుక్క దాడి



పిచ్చికుక్క దాడిలో గాయపడిన లవ్‌కుమార్

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు పంచాయతీ రావికంపాడులో బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన మూడేళ్ల తేనె లవకుమార్ మణికంఠ పాత సినిమాహాల్ వద్ద ఆదివారం ఆడుకుంటుండగా కుక్కల గుంపులో నుంచి ఆకస్మాత్తుగా ఓ పిచ్చికుక్క వచ్చి దాడి చేసింది. దీంతో బాలుడి ఎడమ కాలు, బొడ్డు వద్ద తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని కుటుంబ సభ్యులు పెనుబల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించారు.

బడ్డీ యాప్‌తో సమస్యకు చెక్




యాప్ ద్వారా అందించే సేవలు

● కార్యాలయానికి వెళ్లకుండానే సమస్యలపై దరఖాస్తులు
● కేఎంసీ పరిధిలో పెరుగుతున్న సిటిజన్ బడ్డీ యాప్ వినియోగం
● 2018 నుంచి ఇప్పటి వరకు 10,555 ఫిర్యాదులు నమోదు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఏ సమస్య ఉన్నా ఇంటి నుంచే పరిష్కరించుకునే వెసులుబాటు మున్సిపల్ శాఖ కల్పించింది. సమస్య పరిష్కారం కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగకుండా స్మార్ట్ ఫోన్‌లో యాప్‌పై ఒక క్లిక్ ఇస్తే చాలు.. సమస్య అధికారులకు చేరి పరిష్కారానికి నోచుకుంటుంది. ప్రభుత్వం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు పౌర సేవలు అందించేందుకు సిటిజన్ బడ్డీ యాప్‌ను ఐదేళ్ల కిందట తీసుకొచ్చింది. కార్పొరేషన్‌లో పలు విభాగాలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు చేయడంతో పాటు పౌర సేవలు వినియోగించుకోవడం, తమ ప్రాంతాల సమాచారం తెలుసుకునేలా యాప్‌ను రూపొందించారు. దీంతో స్మార్ట్ ఫోన్ వినియోగదారులు సులువుగా తమ డివిజన్లలో సమస్యలను అధికారులకు యాప్ ద్వారా చేరవేస్తున్నారు.

అన్నీ యాప్‌లోనే..

ప్రధానంగా పౌర సేవలు, ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సిటిజన్ బడ్డీ యాప్‌ను రూపొందించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజలు ఈ యాప్‌ను వినియోగించుకునేలా రూపొందించారు. యాప్‌లో కార్పొరేషన్‌కు సంబంధించిన సమాచారంతో పాటు ప్రజాప్రతినిధులు, ఆయా ప్రాంతాల అధికారులు, సిబ్బంది జాబితా, కమిషనర్, కార్యాలయ కాంటాక్ట్ వంటి సమాచారం ఉంటుంది. ఇక పన్ను చెల్లింపులు, ఫిర్యాదులు, ఆన్‌లైన్ సేవలు, పౌర సేవలు, దరఖాస్తు పత్రాలు, అర్బన్ వైబ్స్, ఇతర సేవలు ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. 2018 నుంచి ఈ యాప్ ఖమ్మం నగర ప్రజలకు అందుబాటులోకి రాగా.. భారీ సంఖ్యలో ఫిర్యాదులు యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. యాప్ ద్వారా పరిపాలన, ఇంజనీరింగ్, రెవెన్యూ, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన పౌర సేవలను పొందుతున్నారు.



సిటిజన్ బడ్డీ యాప్ హోం పేజీ

ఫిర్యాదులకు పెద్దపీట

మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల కోసం రూపొందించిన సిటిజన్ బడ్డీ యాప్‌లో ఫిర్యాదుల స్వీకరణకు మున్సిపల్ శాఖ, అధికారులు పెద్ద పీట వేశారు. పౌర సేవలు, సమాచారం అందించడంతో పాటు ప్రజలు ఎలాంటి సమస్య ఎదుర్కొన్నా యాప్ ద్వారా తెలియజేసేలా రూపొందించారు. శానిటేషన్, డ్రెయిన్లు, రోడ్లు, సఫాయిమిత్ర సురక్ష, మంచి నీటి సరఫరా, వీధి దీపాలు, అనధికార, అక్రమ కట్టడాలు, ఉల్లంఘనల నివేదన, ఆదాయం, వీధి వ్యాపారుల సమస్య, ఆహార పరిశుభ్రత, భద్రత, ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు నమోదు చేసేలా సేవలు అందిస్తున్నారు.

సత్వర సేవలు

మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు సేవలందించేందుకు రూపొందించిన సిటిజన్ బడ్డీ యాప్ ద్వారా పౌర సేవల కోసం, సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులో పరిష్కారం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేఎంసీలో ఈ ఫిర్యాదులను పరిశీలించి, ఆయా విభాగాలకు అందించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశారు. ఈ గ్రీవెన్స్ సెల్‌లో నిరంతరం యాప్‌ను పరిశీలించి, వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాలకు పంపడంతో పాటు ఎన్ని రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందనే విషయాన్ని ఫిర్యాదుదారుడికి సంక్షిప్త సమాచారం అందజేస్తారు. ఫిర్యాదులు పరిష్కారం అయిన తర్వాత ఫిర్యాదుదారుడి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు.

సిటిజన్ బడ్డీ యాప్‌నకు వచ్చిన ఫిర్యాదుల వివరాలు ఇలా..

విభాగం	వచ్చిన ఫిర్యాదులు	పెండింగ్
శానిటేషన్	5,214	07
రెవెన్యూ	376	03
టౌన్ ప్లానింగ్	589	30
ఇంజనీరింగ్	3,092	31
ఎలక్ట్రికల్	994	05
పెన్షన్	18	–
ఇతరాలు	272	–

పెరుగుతున్న ఆదరణ

సిటిజన్ బడ్డీ యాప్‌కు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. ఇంటి నుంచి తమ ప్రాంతంలో, తమ వీధిలో తమకు ఎదురవుతున్న సమస్యలతో పాటు నగర పాలకసంస్థ నుంచి తమకు అందే సేవల్లో జాప్యం, ఇతర అంశాలపై ప్రజలు యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నారు. డ్రెయినేజీ శుభ్రం చేయకుంటే ఫొటో తీసి డివిజన్, ప్రాంతం పేరు నమోదు చేసి, డ్రెయినేజీ ఫొటోను అప్‌లోడ్ చేస్తున్నారు. అధికారులు సమాచారం పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో యాప్ ద్వారా ఇటీవలికాలంలో ఫిర్యాదుల సంఖ్య పెరిగింది. 2018 నుంచి ఇప్పటి వరకు 10,555 ఫిర్యాదులు అందగా.. వాటిల్లో అత్యధికంగా శానిటేషన్‌కు సంబంధించిన ఫిర్యాదులు 5,214, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించినవి 3,092 ఫిర్యాదులు ఉన్నాయి.



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

కేసీఆర్ ప్రభుత్వమే శ్రీరామ రక్ష

ఇల్లెందు: సీఎం కేసీఆర్ ప్రభుత్వమే ప్రజలకు శ్రీరామరక్షగా ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఇల్లెందులోని సింగరేణి స్కూల్ ఆవరణలో సోమవారం రాత్రి జరిగిన నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గతంలో తాను ఇచ్చిన మాట ప్రకారం ఇల్లెందు పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపించానని చెప్పారు. జూన్ 2 నుంచి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలు ఉంటాయని, సాధించిన ప్రగతిని ఈ వేడుకల్లో ప్రజలకు వివరించాలని కోరారు. ఎమ్మెల్యే టికెట్ ఇస్తే ఓడిపోయిన కోరం కనకయ్యను మూడు నెలలు తిరగక ముందే జెడ్పీటీసీగా గెలిపించి జెడ్పీ చైర్మన్‌ను చేశామని, ఫార్చునర్ కారు ఇస్తే తిరిగినన్నీ రోజులు తిరిగి ఇప్పుడు బీఆర్‌ఎస్‌కు, సీఎం కేసీఆర్‌కు ద్రోహం చేశాడని విమర్శించారు. జెడ్పీ చైర్మన్ పదవికి తక్షణమే రాజీనామా చేయాలని సూచించారు. ఇల్లెందు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.786 కోట్లు అందజేశామని చెప్పారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలు సౌఖ్యంగా ఉన్నారని, మూడు నెలల కాలమే ఉన్నందున చేసిన పనిని ప్రజలకు వివరించాలని కోరారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టబోతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఇల్లెందులో లైట్లు, చెట్లు, రోడ్లు, మంచినీటి సరఫరా, భవన నిర్మాణాలు, బస్‌డిపో ఇలా ఎన్నో సాధించామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, జిల్లా అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హరిసింగ్‌నాయక్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పట్టణ, మండల నాయకులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, యూత్, మహిళా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

డీసీసీబీలో అవినీతిపై మళ్లీ విచారణ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో జరిగిన అవినీతి, అక్రమాలపై సోమవారం ఇద్దరు సభ్యుల బృందం విచారణ ప్రారంభించగా, వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ మేరకు గతంలోనే రాష్ట్ర సహకార బ్యాంక్ (టస్కాబ్) నోటీసులు జారీ చేసింది. టస్కాబ్ డీజీఎం బందెల అంజయ్య, ఏజీఎం రాఘవులు విచారణ చేస్తున్నారు. అప్పుదారులు, జమానత్‌దారులు, సాక్షులు కలిపి 75 మందిని.. రోజుకు 15 మంది చొప్పున విచారించనున్నారు. కాగా, సోమవారం ఎనిమిది మందిని మాత్రమే విచారించారు. ఎంక్వైరీ పూర్తయిన తర్వాత సమగ్ర నివేదికను టస్కాబ్‌కు అందించనున్నారు. నివేదిక ఆధారంగా రుణాల రికవరీతో పాటు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అసలేం జరిగిందంటే..

ఖమ్మం డీసీసీబీ పరిధిలో ఉన్న పలు బ్రాంచ్‌ల్లో మార్ట్‌గేజ్ రుణాల విషయంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఏడేళ్ల క్రితం వెలుగులోకి వచ్చింది. నగరంలోని ఎన్నెస్పీ, ప్రధాన కార్యాలయం, రోటరీ నగర్ బ్రాంచిల్లో నకిలీ ధ్రువపత్రాలు తనఖా పెట్టి 20 మంది రూ.4.50 కోట్ల మేరకు మార్ట్‌గేజ్ రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. 2020లో అధికారుల మధ్య విభేదాలతో ఈ విషయం బయటపడింది. అప్పుడు విచారణ కమిటీని ఏర్పాటు చేయగా.. దస్తావేజులు, స్థిరాస్తులను పరిశీలించారు. ఈ క్రమంలో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించిన వారిపై కేసులు నమోదయ్యాయి.

నకిలీ డాక్యుమెంట్ల అంశంపై రాష్ట్ర ఫైనాన్స్ బ్యాంక్ తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ సొసైటీ యాక్ట్ ఆధారంగా చర్యలకు ఆదేశించడంతో.. టస్కాబ్ డీజీఎం బందెల అంజయ్యతో కూడిన బృందాన్ని నియమించారు. గత మార్చిలో ఈ బృందం మూడు రోజులపాటు విచారణ చేసినా పలువురు హాజరు కాలేదు. దీంతో మరోసారి విచారణకు ఉపక్రమించింది.

కాల్వలో పడిన ఆటో

● మహిళ మృతి.. ఐదుగురికి గాయాలు
● పెళ్లింట విషాదం



కాల్వలో పడిన ఆటో

వైరా: డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆటో అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లడంతో మహిళ తీవ్రంగా గాయపడి మృతి చెందింది. మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం వైరా – మధిర రాష్ట్రీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ వీరప్రసాద్ కథనం మేరకు.. కొణిజర్ల మండలం చిన్నమునగాల గ్రామానికి చెందిన పాపగంటి ఏసుపాదం, ఎల్లమ్మ దంపతుల కూతురు యాప్లీ వివాహం వచ్చే నెల 5వ తేదీన జరగనున్నది. ఆ వివాహానికి సంబంధించి బంధువులతో కలిసి చిన్నమునగాల నుంచి ఆటోలో వైరా వస్తుండగా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామ సమీపంలోని వైరా రిజర్వాయర్ కుడి కాల్వలో ఆటో అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో పాపగంటి నాగేంద్రమ్మ (50) తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందింది. పాపగంటి ఏసుపాదం, పాపగంటి నాగమణి, మరియమ్మ, కొంగల అరుణ స్వల్పంగా గాయపడ్డారు. ఆటోడ్రైవర్ గందం సత్యానందంకు కాలు విరిగింది. స్థానికులు క్షతగాత్రులను 108 ద్వారా తొలుత వైరా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ఓ వైపు రోడ్డుపై గేదెలు అడ్డురావడం, డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం ప్రమాదానికి ముఖ్య కారణమని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కాగా, ఏసుపాదంకు పెద్దమ్మ వరుస అయ్యే నాగేంద్రమ్మ మృతి చెందడంతో పెళ్లింట విషాదం నెలకొంది. నాగేంద్రమ్మ గ్రామ వార్డు సభ్యురాలిగా పనిచేస్తున్నారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



నాగేంద్రమ్మ మృతదేహం

ముగ్గురు మావోయిస్టుల అరెస్ట్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట పోలీసులు ముగ్గురు మావోయిస్టులను సోమవారం అరెస్ట్ చేశారు. కుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని సున్నంగుడ, మురళిగుడ అటవీ ప్రాంతంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ముగ్గురు మావోయిస్టులు తారసపడటంతో వారిని అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

కార్పొరేట్ కళాశాలలో ఉచిత ప్రవేశాలు..



కస్తాల సత్యనారాయణ

కొత్తగూడెంరూరల్: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి కనీసం 7 జీపీఏ సాధించిన పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యా పథకం కింద ఇంటర్మీడియట్ ప్రవేశాలు కల్పించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు ఉమ్మడి జిల్లాలో ఐదు కళాశాలల్లో 268 సీట్లు ఉన్నాయని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలం కృష్ణవేణి జూనియర్ కళాశాలలో 161, ఖమ్మం జిల్లాలోని శ్రీ చైతన్య ఆర్ట్స్ అండ్ సైన్స్ , సీవీ రామన్, రెజొనెన్స్, కృష్ణవేణి కో ఆపరేటివ్ జూనియర్ కళాశాలలో 107 సీట్లు కేటాయించినట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2 లక్షలు, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.లక్ష మించరాదని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలు, పదో తరగతి మెమో, నాలుగు నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, వసతి గృహాల్లో చదివిన వారైతే 8, 9, 10 తరగతుల హాస్టల్ ధ్రువీకరణ పత్రం, 2 పాస్‌పోర్ట్ ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్, రేషన్‌కార్డు నకళ్లు జతపర్చాలని కోరారు. దివ్యాంగులైతే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని తెలిపారు. www.telangana.epass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మధిర: మండలంలోని మడుపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన మర్సకట్ల అభిషేక్ (16) మోటార్ సైకిల్‌పై మధిరకు వెళ్తున్నాడు. రాయపట్నం బ్రిడ్జి, మడుపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న మలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అభిషేక్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

లారీకింద పడి బీటెక్ విద్యార్థి మృతి

● నుజ్జునుజ్జయిన శరీరం.. కుటుంబంలో విషాదం

పాల్వంచ: లారీకింద పడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన బీటీపీఎస్ ఉద్యోగి అనుమల్ల శ్రీను కుమారుడు జీవన్‌రెడ్డి (22) సోమవారం మోటార్ సైకిల్‌పై రాహుల్‌గాంధీనగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బీసీఎంరోడ్‌లోని ఆశ్రమ పాఠశాల సమీపంలోకి రాగానే మున్సిపల్ చెత్త బండికి తగిలి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో పాల్వంచ నుంచి కొత్తగూడెం వెళ్తున్న లారీ జీవన్‌రెడ్డి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు భారీగా అక్కడికి చేరుకోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నరేశ్ ఘటనా స్థలానికి చేరుకుని చెల్లాచెదురుగా పడిపోయిన శరీర భాగాలను చేతితో పట్టుకుని ఆటోలో ఎక్కించడం గమనార్హం. జీవన్‌రెడ్డి బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: పురుగులమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని పాండురంగాపురంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పాండురంగాపురానికి చెందిన పోతురాజు శివప్రసాద్ (26) సోమవారం చేను వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న శివప్రసాద్‌ను చుట్టుపక్కల వాళ్లు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి అతడిని ఆటోలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. యువకుడు పురుగులమందు తాగడానికి గల కారణం తెలియరాలేదు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

రఘునాథపాలెం: విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కార్మికుడు మృతిచెందిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం నగరంలోని కైకొండాయిగూడెంనకు చెందిన ఎలక్ట్రీషియన్ పింగలి రాము (40) కొన్నేళ్లుగా విద్యుత్ లైన్లు వేసే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. రోజువారీ పనిలో భాగంగా సోమవారం రఘునాథపాలెం మండలం మూలగూడెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచే పనిచేస్తున్నాడు. 11 కేవీ స్తంభం వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. అయితే, ఎల్సీ తీసుకోకుండా పనులు చేయించడంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకెళ్లి ఖమ్మం నగరంలోని కాంట్రాక్టరు నాగేశ్వరరావు ఆఫీస్ ఎదుట ఉంచి ఆందోళన చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మృతుడి బంధువులు కాంట్రాక్టరుతో మాట్లాడుకొని ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. మృతుడి భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.రవి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.



రాము మృతదేహాన్ని చూసి రోదిస్తున్న కుటుంబ సభ్యులు